# 15. చదువూ బతుకూ

ఆరోజు సాయంకాలం.

సామాన్యంగా కనిపించినా నా మనసుని మలుపు తిప్పిన సంఘటన జరిగింది అప్పుడే! ఆఫీసు పనిలోని అలసట తలనొప్పిగా మారగా ఆ చిరు చీకటివేళ ఇంటి తాళం తీసి లోపల అడుగెట్టి స్విచ్చి వేస్తే లైటు వెలగలేదు సరికదా, ఎప్పట్నుంచో కరెంటు పోయిన సూచనగా ఫ్రిజ్ నుంచి కారిన నీళ్ళు కాలువ కట్టి కాళ్ళని తడిపేయి. ఒంటరితనమంటే ఎంతో ఇష్టపడే నాకు అదే భరించలేనిదవడం ఆశ్చర్యమనిపించింది. ఇవతలి వీధి వరండాలో స్ట్రీటు లైటు కాంతి పడుతోంది. ఇన్ని మంచినీళ్ళు తాగి పడక్కుర్చీ తెచ్చి వరండాలో వేసుకుని అందులో ఉసూరుమంటూ కూలబడ్డాను. అలా హెల్ప్‌లెస్‌గా తయారవడం నాకు ఇష్టముండదు. ఒకరి మీద ఆధారపడడం నాకు నచ్చదు. అందుకనే దాసీదాన్ని సహా నేను పెట్టుకోను. గిన్నెలు కడుక్కోడం, బట్టలు ఉతుక్కోడం -యిలాంటి అతి మామూలు పనులు, యూనివర్శిటీ గోల్డ్ మెడలిస్ట్‌ని, నాకా చేతకానివి! నేను డబ్బు కూడబెట్టి కొనుక్కున్న కైనెటిక్ హోండాని నేనే నడిపి తీరాలనేటంత వ్యక్తిత్వం నాది. పక్కని ఇంటివాళ్ళుంటే సైడు పోర్షన్లో ఉంటూ వారితో సరిపెట్టుకోలేకే ఒక ఏడాదిలో నాలుగు వాటాలు మారేను. ఆఖరికి బాగా అద్దె ఎక్కువైనా పూర్తిగా నా కిందే ఉండే ఈ యింటికి ఇటీవలే మారేను. ఎక్కడ ఏ కాలేజీలో చదివినా ఫస్టు మార్కు నాదే. నా సర్టిఫికేట్లూ, ఇంటర్ వ్యూలో నా బహుభాషా పాండిత్యమూ గమనించి, పిలిచి మరీ పెద్ద జీతం ఆఫర్ చేశారు. నెల అయేసరికి చేతికి చిక్కే మొత్తం బాగానే ఉందిగాని నా పని నేను చేసుకుపోతూంటే వీళ్ళూ ఏవేవో విమర్శలు చెయ్యడం నాకేం బావుండలేదు. నేను ఎందుకు సర్దుకుపోవాలో అర్థం కావడం లేదు!

'పెళ్ళికెదిగిన ఆడపిల్లని చేజేతులా ఓ మరబొమ్మలా తీర్చిదిద్దింది మీరే. అనుభవించండి' అని మా డాడీతో మమ్మీ చేసే విమర్శ నా చెవిన పడక పోలేదు. ఎవరే మనుకుంటే నాకేం? అయినా మమ్మీమాట కూడా కాదనలేం. నన్నో విదుషీమణిగా తయారు చెయ్యడంలో డాడీదే ముఖ్యపాత్ర మరి. మెట్రిక్‌లో, ఇంటర్లో, గ్రాడ్యుయేషన్‌లో నా ఆల్‌రౌండర్ ఫస్ట్‌క్లాస్ కెరీర్‌కి వెన్నూ, దన్నూ మా నాన్నే! పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కూడా 'ఓహో' అనిపించి జాబ్ సేకరించే దాకా ప్రోత్సహించిన డాడీ ఉన్నట్టుండి మమ్మీవైపు మొగ్గు చూపితేనే ఎక్కళ్ళేని తిక్కా పుట్టుకొచ్చింది నాకు. ఇప్పట్లో వద్దని చెప్పినా నాకు పెళ్ళి సంబంధాలు తీసుకురాడమే నన్ను వాళ్ళకి దూరం చేసింది.

'బేబీ, ఈ జులై ఫస్ట్‌కి నువ్వు ట్వంటీ త్రీ కంప్లీట్ చేస్తున్నావు. కావాలనుకున్నప్పుడు మనకి మళ్ళీ మంచి సంబంధాలు రావు' అని అదే పాయింటు డాడీ రిపీటెడ్‌గా చెప్పడం నాకు నచ్చలేదు.

'డాడీ, ఇన్నాళ్ళూ నాకు ఫుల్ ఫ్రీడం ఇచ్చి ఎంకరేజ్ చేశారు. నాకు నచ్చిన జాబ్‌లో అయిదారేళ్ళు చేసి స్థిరపడేదాకా నా మేరేజ్ ఊసు ఎత్తొద్దని మీతో చెబితే అలాగేనని ప్రామిస్ చేశారు. అమ్మయితే ఓ ఆర్డినరీ గ్రాడ్యుయేట్. మీరూ అదే విషయాన్ని సాగతీస్తే ఎలా?' అని స్పష్టంగా చెప్పేను.

సినిమాలకి, టీవీలకీ పరిమితమైన పెళ్ళిచూపుల అవుట్‌డేటెడ్ తతంగం అలా ఉంచి, వయస్సులో ఓ పాతికేళ్ళు వెనకబడి ఉన్న తల్లిదండ్రులు ఈ మోడ్రన్ ఏజ్‌లో కూడా తమ పిల్లలకి తగిన జతల్ని వెతకడమేమిటో నాకు అర్థం కాదు. అయినా డాడీ ఇంకా నాకు వరుణ్ణి సమకూర్చే ప్రయత్నంలో ఉండడం నా మనసుని గాయపరచింది. వాళ్ళకి తెలీకుండా ప్రయత్నించి ఆ ఆఫీసుకి ఈ ఊళ్ళో బ్రాంచి ఉంటే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకు వచ్చేశాను. అదీ ముందుగా పసికట్టిన డాడీ ఎంత అడ్డుపెట్టినా నేను వినలేదు, వినదల్చుకోలేదు!

పడక కుర్చీలో కూచుని పాత విషయాలు నెమరు వేసుకుంటున్న నేను ఒక్కసారి కరెంటు వచ్చి లోపలి లైటు మీద బడడంతో లేవాలని ప్రయత్నించాను. ఎవర్నీ లక్ష్యపెట్టని నా ఎడ్యుకేటెడ్‌మైండ్ సహా ఆ పరిస్థితుల్లో ఎవరైనా వచ్చి చెయ్యి అందించి లేవదీస్తే బావుణ్ణనిపించడం నాకే మింగుడు పడలేదు. సరిగ్గా అదే సమయంలో అనుకోకుండా నా జీవితంలోకి ఓ కొత్త పాత్ర ప్రవేశించింది! కొత్త వెలుగంటే కరెక్టేమో. అదెవరో మాకు బాగా దూరపు బంధువట. నాకు చిన్నమ్మ వరస అవుతుందిట. 'కామాక్షి కక్కీ' అని పిలవమని ఆర్డరు కూడా వేసింది.

అమ్మా, నాన్నలకైనా నేనే ఆర్డరు వెయ్యడం తప్ప ఒకరి ఆజ్ఞల్ని తలదల్చడం నాకు అలవాటులేని పని.

కోవెలకి వెళ్ళొస్తూ ఆ దీపపు వెలుగులో దగ్గరగా వచ్చి నా మొహం తేరిపారి చూసి ఆ చురుకైన కళ్ళు ఇట్టే పోల్చేసుకున్నాయిట.

'నువ్వటే? విజయనగరం కానుకుర్తి వారి వీధిలో కొళాయి పక్క సందులోని మూడో డాబా యింటి వెంటాచలం కూతురివి, బేబీ అనేవారు, చిన అలివేలు మంగతాయారు కూతురువి, నువ్వే కదటే! ఎంత దానివి ఎంత అయావే! ఇక్కడున్నావేమిటీ, మీ ఆయనకి గాని ఈ ఊళ్ళో పనా? పిల్లలెందరూ?' అని గుక్క తిప్పకుండా ప్రశ్నల వర్షం కురిపించి, నుదుటి మీద చెయ్యేసి చూసి, 'అయ్యో కాలిపోతోందే నుదురూ, లోపలికి పదవే తల్లీ' అంటూ రెక్క పట్టుకు లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టింది.

గ్రాడ్యుయేట్ అయిన తల్లినైనా తక్కువ చూపు చూసే నేను, ముక్కూ, మొహం ఎరగని ఈ పూర్వకాలపు ముసల్దాని స్పర్శకి స్పందించడం నాకే అర్థం కాని విషయం. అంతేకాదు, నన్నైనా అడక్కుండా అక్కడున్న టెలిఫోను ఉపయోగించి నిమిషాల మీద తనకి తెలిసిన డాక్టర్ని రప్పించి తక్షణ వైద్యం చేయించింది. అక్కడితోనైనా సరిపెట్టిందా? నా ఒంటరి జీవితం సంగతి నా నోటనే కక్కించి నేనెంత వద్దంటున్నా వినకుండా నా చేతే ఇంటికి తాళం వేయించి వాళ్ళింటికి తీసుకుపోయింది, ఇంతటి హై ఫీవర్ తో నన్నిక్కడ ఎంత మాత్రం ఉంచనంటూ.

ఓ వ్యాపారస్థుడి ఏకైక వారసురాల్ని. సకల సదుపాయాలతో పెరిగి పెద్దదాన్నైన నాకు ఎందరు నౌకర్లున్నా వాళ్ళని ఓ గీత గీసి దూరం దూరంగానే ఉంచేదాన్ని. నాకని ప్రత్యేకించిన రూంలోకి ఎవర్నీ రానిచ్చేదాన్ని కాను. నా వస్తువులెవరైనా నే పెట్టిన చోటు నుంచి మార్చేస్తే, ఆఖరికి మా మమ్మీ అయినా సరే, ఎగిరి కంట్లో పడేదాన్ని. చివరికి మా డాడీ అయినా సరే వేసి ఉన్న తలుపుని తట్టి పెర్మిషన్

తీసుకుంటే తప్ప నా గదిలోకి రావడానికి లేదు. 'ఇదెక్కడి ఒంటి పిల్లి రాకాసి దొరికిందండీ బాబూ!' అని మా మమ్మీ విసుక్కోని రోజంటూ ఉండేది కాదు. ఆడవనీ, మగవనీ ఎవరి అభిరుచికి తగ్గట్టు వారి వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోడంలో తప్పేమిటో నాకు బోధపడలేదు. పనికి మాలిన భోగట్టాలతో, పోచికోలు కబుర్లతో టైం వేస్టు చెయ్యకుండా డిసిప్లిన్ పాటిస్తూ విజ్ఞాన గ్రంథాలతో మునిగితేల్తూ, పోటీ పరీక్షల్లో నెగ్గుతూ పైపైకి రావడమే నా జీవిత లక్ష్యం. అలాంటి నా నుంచి నన్ను వేరు చేసే ప్రయత్నాలు చేశారు గనుకనే అంతగా నా మీద ఆశలు పెట్టుకున్న మా వాళ్ళ నుంచే వేరయాను.

నేనీ జాబ్‌లోకి ట్రాన్స్‌ఫరై వచ్చి చేరిన ఓ వారం రోజులకి కాబోలు మా మమ్మీ నా ఎడ్రసు పట్టుకు వచ్చింది. ఒక్క వారం రోజుల్లోనే ఓ మనిషి అంతగా డౌన్ అయిపోడం నేను ఊహించలేకపోయాను.

'నన్నేం చూశావ్, నీ లెటర్ చదివిందగ్గర్నుంచీ మీ డాడీ ఎంత హర్ట్ అయారంటే మళ్ళీ హార్ట్ ఎటాక్ వస్తుందేమో అని బెంగెట్టుకు చస్తున్నాం. బేబీ, మనమేం 'స్వయంభూ'లం కాదు. సీత లాగో, ద్రౌపది లాగో ప్రకృతిలోంచి పుట్టుకొచ్చిన అయోనిజలం కాదు. అయినా సంఘం ఒడిదుడుకులకి తట్టుకోడం వాళ్ళకే తప్పలేదు. వాళ్ళెదుర్కొన్న పరీక్షల ముందు నువ్వు పాసయిన పరీక్షలనగా ఎటువంటివి?"

చదువు సంగతి పూర్తిగా తెలీని వాళ్ళు ఇలాగే మాటాడతారు. ప్రతీదానికీ తలాతోకా లేని ఏ పుక్కిటి పురాణానికో లింకు పెడతారు.

'మమ్మీ వై టాక్ రబ్బిష్? ఎందుకొచ్చావో అది ముందు చెప్పు.' 'అంటే వెంటనే వెళ్ళిపొమ్మని కాబోలు. అలాగే చేస్తా. నీ లాంటి జగమొండిని కన్నందుకు ఆయనకే శిక్ష తప్పలేదు. ఇంతకీ మేం చేసిన తప్పేమిటి? పెళ్ళి సంబంధాలు తీసుకొచ్చాం. అంతేగా! లెంపలు వాయించుకుంటున్నాం. మళ్ళీ అలాంటి పొరపాటు చెయ్యమని తను చెప్పలేక నన్ను పంపించారు. నీ కిష్టమైతేనే రా. ఒకటి మాత్రం చెబుతున్నా- ఈ చదువులూ, ఉద్యోగాలూ కూడూ, గుడ్డా పెట్టగలవేమో గాని తోడూ, నీడా కల్పించవు. గుర్తుంచుకో..' అంటూ ఎలా వచ్చిన మమ్మీ, మంచి నీళ్ళైనా ముట్టుకోకుండా, అలాగే రిటర్న్ బస్సు అందుకుంది. నా కెరీర్ నాకు తోచిన పద్ధతిలో కంటిన్యూ చేద్దామనుకున్న నేను పెద్దగా చలించలేదు. రొటీన్‌లో పడిపోయాను. ఒకరెవరు నన్ను శాసించడానికి!

ఇప్పుడీ వైరల్ ఫీవర్ వచ్చి నా నవ నాడులూ క్రుంగదీసేసింది. ఏదైనా మంచి నర్సింగ్ హోంలో చేరతానన్నా కక్కి ఒప్పుకోలేదు. రెండు మూడ్రోజులు వాళ్ళింట్లో రెస్టు తీసుకోమని కక్కి రిక్వెస్ట్ చేస్తే ఒకే ఒక కండిషన్ మీద ఒప్పుకున్నాను. ఈ మామూలు ఇబ్బందిని - ఎట్టి పరిస్థితుల్లోనూ మా వాళ్ళకి చెప్పొద్దని ప్రామిస్ చేయించుకుని మరీ. నాలుగో రోజు మరీ హై టెంపరేచరు వచ్చేసి కళ్ళు తిరిగి పడిపోయినంత పనైతే కక్కి డాక్టర్ని పిలిపించింది. టైఫాయిడ్ సిమ్టమ్స్ కనిపిస్తున్నాయట. మొదట్లోనే కనుక్కున్నారు గనక, పవర్‌ఫుల్ యాంటీ బయాటిక్స్ పుచ్చుకుంటున్నాను గనక, ప్రమాదమేమీ లేదట. ఎటొచ్చీ బెడ్ మీదే ఉండి ఓ రెండు వారాలైనా రెస్టు తీసుకోవాలట. ఆఫీసుకి మెడికల్ లీవ్‌కి అప్లై చేసి

అక్కడే ఉండిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది నాకు.

ఇలాంటి పరిస్థితి వచ్చినా ఇంటికి వెళ్ళడం గాని వాళ్ళ చేత చేయించుకోడానికి గాని నా ప్రిస్టేజ్ అడ్డొచ్చింది. ముక్కూ మొహం ఎరగని ఎదుటి వ్యక్తి సానుభూతి పొందడం మరీ దుర్భరం. అందుకే కామాక్షి కక్కిచేత మరో ప్రామిస్ చేయించుకున్నాను. 'నాకోసం పడిన శ్రమనీ, పెట్టిన ఖర్చునీ, నేను బాగయ్యాక, అణాపైసలతో తీర్చేస్తే పుచ్చుకు తీరాల'ని. 'నీకు సాధ్యమైతే అలాగే చేద్దువుగానిలే' అనే కక్కి సమాధానం అప్పట్లో నాకు అర్థం కాలేదు.

మాది జమీందారీ ఫేమిలీ అయితే కామాక్షీ కక్కీవాళ్ళది హైయర్ మిడిల్ క్లాస్ వ్యవస్థ. ఏది ఎలా ఉన్నా ఆవిడ ఇల్లు నడిపే పద్ధతి గమనిస్తూ ఉంటే ఎంతో చిత్రమనిపిస్తుంది నాకు. మా యింట్లో ప్రతీ ఒక్క పనికీ ప్రత్యేకించి నౌఖర్లు ఉంటారు. తోట పెంచడానికి ఓ మనిషి ఉంటే ఆ పువ్వుల్ని ఏరి పూజాగృహంలోని పళ్లెంలో చేర్చడానిక మరోమనిషి. ఇంటికొచ్చి బట్టలు ఉతకడానికి ఓ మనిషయితే ఆరేసిన బట్టల్ని మడతలు బెట్టడానికి ఓ మనిషీ, వాటిని ఇస్త్రీ చెయ్యడానికీ, అద్దాల బీరువాలో ఓ పద్ధతి ప్రకారం అమర్చడానికీ వేరే వేరే మనుషులు. కామన్ బెడ్ రూం కాక, మమ్మీకీ, డాడీకీ వేరే వేరే రూంలు కాక, అనుమతి లేందే ప్రవేశంలేని నా రూం సరేసరి. ఏ ఒక్కరోజు ఏ పనిమనిషి రాకపోయినా మా మమ్మీ వెర్రెత్తినట్టు విరుచుకుపడడం నాకు తెలిసిన సంగతే!

ఇన్ని సదుపాయాలున్న మా స్వంత బంగళాలో గెస్ట్ రూమ్ అంటూ ఒకటుండాలని మా కెవరికీ తోచలేదు. కట్టుకున్న చిన్న యింట్లో వేరే ఎటాచ్డ్ బాత్ ఉన్న సైడ్ రూం కామాక్షి కక్కిలాంటి సామాన్యురాలు కేటాయించడం నా ఆలోచన తీరునే సవాలు చేసింది. ఉన్న ఇద్దరు కొడుకులూ డాక్టర్లట. కాపరాలతో కెనడాలో స్థిరపడ్డారట. వద్దన్నా అలా డాలర్ల వర్షం కురిపిస్తూనే ఉంటారట. 'నాకెందుకే బేబీ, ఏం చేసుకోవాలట! పంపించింది పంపించినట్టు అలా వారిద్దరి పేరా వేరు వేరు ఎకౌంట్స్‌లో వేసేస్తూ ఉంటాను. ఆయనైతే లేరుగాని, మీ కక్కగారు కట్టించిన ఈ ఇల్లుంది. ఫామిలీ పెన్షన్ ఉంది. నాకేం రోగమా, రొష్టా! దుక్క ముక్కలా ఉన్నాను. నలుగురికి సాయపడ గలిగితే అదే చాలు!

ఆ రోజుల్లోనే మెట్రిక్ పాసై నర్సు ట్రైనింగ్ కూడా అయిందట కక్కి. ఎవరేం చదువుకున్నా, ఎలాంటి శిక్షణ తీసుకున్నా దాన్ని జీవితం:లో ఆచరించడం ముఖ్యమనే విషయాన్ని కక్కి తన ప్రతి కదలికలోనూ బహిర్గతం చేస్తుంది. అలా మంచం మీద పడుకుని ఈవిణ్ణి అబ్జర్వ్ చెయ్యడమే నాకో నిత్యకృత్యమైపోయింది. నా లెక్క ప్రకారం కక్కికి ఏ అరవై అయిదో ఉండి ఉండాలి. ఆ వయసుకి ఆడదాని సమస్యలకి ఆవిడ దూరం అనుకోడానికి లేదు. కక్కికంటె, ఓ పదేళ్ళైనా చిన్న అయిన మా మమ్మీ ఇంటి నిండుగా నౌకర్లున్నా 'ఈమోకాళ్ళ నొప్పులు భరించలేకుండా ఉన్నానే తల్లీ' అని రోజుకి పదిసార్లైనా అంటూ ఉంటుంది. ఇక ఈవిడ? 'నాకేం దుక్క ముక్కలా ఉన్నాను' అని కాక వాక్యం మొదలెట్టదు, ఓ కాలు ఈడుస్తూ నడుస్తున్నా సరే! తమాషా ఏమిటంటే ఏమీ తోచక 'హిందూ' లోకి క్రాస్‌వర్డ్ పజిల్స్ చేసే నాకు ఏదైనా సొల్యూషను తోచకపోతే 'ఈపదం సరిపోతుందేమో చూడు!'

అంటూ కక్కి జవాబులు అందించడం!

దాసీదీ, వంటమనిషీ ఆవిడకీ ఉన్నారు గాని వాళ్ళ మీద అథార్టీ, అజమాయిషీ చేసినట్టు లేదు. చెయ్యవలసిన పనేదో చెప్పి నా దగ్గరికొచ్చి కూచునేది. మొదట్లో నా గురించి వివరాలు అడిగిందే తప్ప ఆ తర్వాత ఆ ప్రసక్తే తేలేదు. పైగా ఆడది చదువుకోక ఎలా వెనకబడిపోతోందో చెబ్తూ ఉంటే ఇండైరెక్ట్‌గా నన్ను ఎంకరేజ్ చేసినట్టే అనిపించింది. మరోమనిషైతే 'నువ్విలా సిక్ అయిపోయావని మీ వాళ్ళకి తెలియ జెయ్యకపోతే సాటి బంధువుని, బతికున్నన్నాళ్ళూ మీ వాళ్ళు నన్ను తిడతారు' లాంటి డైలాగులు మాట వరసకైనా లేవు! 'కూపీలు లాగని ఆడాళ్ళు కూడా ఉంటారా!' అని ఎవరికైనా అనుమానమొస్తే మా కక్కిని కలుసుకోడం మంచిది.

వారం పది రోజులు గడిచి, పూర్వపు ఆరోగ్యాన్ని పుంజుకుంటున్న నా శరీరంలో మార్పులు సహజమే! మనస్సులో కూడా ఏవేవో మార్పులు రావడం నాకే వింతగా తోచింది. నేను చేసిన పొరపాటేమిటో గుర్తొచ్చి మనసులోని మబ్బులు ఒకటొకటీ క్లియర్ అయిపోతున్న అనుభవం కలిగింది. టీచర్స్తూ, గైడ్సూ, పుస్తకాలూ, పాఠాలూ చెప్పలేని సంగతులు చాలా ఉన్నాయి కాబోలు. సాటి మనుషులతోగాని, పరిస్థితులతోగాని సరిపెట్టుకోలేని లక్షణాన్ని వ్యక్తిత్వం అనరేమో.... జీవితాన్ని చదవడం ముందు పుస్తకాన్ని చదవడం ఏమంత ముఖ్యం కాదేమో....

నాలాగే కామాక్షి కక్కీ ఒంటరిదే. అయినా అలా అనిపించదు మనకి. నవ్వుతూ తీసుకోడం తప్ప కంప్లెయింట్ అనేది ఆ నోట వినం. దూరంగా ఉన్న పిల్లలతో సహా అంత సాన్నిహిత్యం ఎలా మెయిన్‌టెయిన్ చేస్తోందో.... ఎవరో ఎందుకు, తన కింద చేస్తున్న పనిమనుషుల్ని కూడా ఎంతో దగ్గిర వాళ్ళలా ట్రీట్ చెయ్యగలదు.

రెండు పత్యాలు వంటపట్టి ఆరోగ్యం చేకూరినా ఇంకా ఏవేవో మానసిక సందేహాలు నన్ను దొలుస్తూనే ఉన్నాయి. 'నాకిక్కడే ఉండిపోవాలనుంది. ఎన్నెన్నో తెలుసుకోవాలి. నువ్వు కోరిన రెంట్ యిస్తాను. ఈ గెస్ట్‌రూం నాకు అద్దెకివ్వు. కామాక్షి కక్కీ' అని అడిగి చూశాను. ఆమె జవాబిదీ:

'సారీబేబీ.... ఇది అద్దె కోసం కట్టింది కాదు. ఇదుంది కాబట్టే నీకీమాత్రమైనా చెయ్యగలిగాను. పెద్దాసుపత్రికి దగ్గిరగా ఉంది గనక ఎవరెవరో వస్తూంటారు. ఇలా ఇది ఉండడం నా అదృష్టంగా వాళ్ళని ఎటెండ్ అవుతూ ఉంటాను. ఇంతెందుకు, మా పని మనిషి సూరమ్మ లేదూ, దాని అక్క కోడలు రేపు సాయంకాలం బస్సులో వైద్యం కోసం ఇక్కడి కొస్తోంది. ఎల్లుండి మధ్యాహ్నం దానికి సిజేరియన్ చేస్తారట. అన్నీ సవ్యంగా గడిచాక అది కోలుకొనేది ఈ గదిలోనే కదా! అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉంటావుగా, ఈ పిన్ని అనేది ఒకతుందని మరిచిపోకు'.

ఆ రాత్రే మా అద్దె యింటి కొచ్చిన నేను చేసిన మంచి పని-డాడీకి 'సారీ' చెబుతూ ఫోన్ చెయ్యడం.

★